# వనభోజనం

"అదోక కాలం! వెర్రి కాలం!"

వెర్రేమిటి! కాలమేమిటి! అని చాలమందికి ఆశ్చర్యం కలగవచ్చు. అసలు నేనుకూడా మా నరసయ్య మామ నోటిగుండా ఆమాటలు విన్నప్పుడు విస్తుపోయినమాట వాస్తవం!

"అదేమిటి మామయ్యా! చరిత్రలోనైతే హిందూ యుగమనీ మహమ్మదీయయుగమనీ యేవో వున్నాయని విన్నాను. కానీ వెర్రికాలంసంగతి నేనెప్పుడూ వినలేదే!" అన్నాను.

నా సందేహానికి సమాధానంగా వెర్రికాలమేదో వుదహరించి నరసయ్యమామ అందుకు కారణాల్ని గూడా విపులీకరించి చెప్పాడు.

ధాత కరువులోనట మా నరసయ్యమామకు నూనూగుమీసాలు వస్తూ వస్తూ వున్నాయట! కరువు, కరువు అన్నమాటేగానీ అప్పుడు రూపాయకుపన్నెండుపళ్లు రంగూను నూక దొరికేదట! అప్పటికి మా ప్రాంతంలో రైళ్లూ, బస్సులు లేకపోవడంవల్ల మా నరసయ్యమామ గిత్తల్ని కొనుక్కురావడానికి పలమనేరు పశువుల పరసకు నడిచేవెళ్లేవాడట! ఎక్కడో మా వూరికి ఆమడదూరంలో వున్న మల్లేశ్వరుడికోనలోనుంచీ ఆరు మూరల పొడుగున్న వెగిదూలాన్ని తనొక్కడే భుజంమీద మోసి తెచ్చి యింటిదగ్గర దింపేసేవాడట!

ఆ వెగిదూలాన్ని ఈరోజుల్లో ఏ యువకుడైనా ఎత్తి భుజంమీద పెట్టుకుంటే తన బావినీ పొలాన్ని వాడికి విక్రయం చేసిస్తానంటూ సవాలు విసురుతాడు నరసయ్యమామ.


అతడి బావినీ, పొలాన్నీ ఆశించిగాకపోయినా ఈ తరంవారి ప్రతిష్ఠను నిలబెట్టడానికైనా కొందరు వస్తాదులు ముందుకురావచ్చుగదా! ఊహు రారే!

"మీ వల్ల నేమౌతుందిరా బాబూ! అదోక కాలం! వెర్రి కాలం! చింతకాయతొక్కు నంజుకుంటూ ఒక దుత్తెడు అంబలి మజ్జిగతో కలిపి త్రాగి పార చేతబట్టి పొలంలో వంగితే మళ్లీ మధ్యాహ్నానికే తల పైకెత్తేవాళ్ళం. బండిలో నాలుగుగోనెల బెల్లంవేసి సునాయాసంగా చక్రంతిప్పి నోగను పైకెత్తి కందెన వేసుకునేవాళ్ళం. ఇప్పుడా తిండీలేదు. పనీలేదు."

మా నరసయ్యమామ భోజనప్రియుడు. గుక్కెడు కాఫీనీళ్ళతో మధ్యాహ్నందాకా పొట్టని బిగబట్టుకోగల నాగరికులకు అతడి భోజనప్రియత్వం అర్థంగాదు. ఐనా నరసయ్యమామ యిప్పుడేం తింటున్నాడు గనుక! అతడి భోజనసౌఖ్యం నాగమ్మత్తతోనే పోయింది. చచ్చి స్వర్గంలోవుంది ఆ యిల్లాలు! తన భర్తకే పదార్థం రుచో, ఏ ఏ కాలంలో అతడు ఏదేది తినాలని వాంఛిస్తాడో ఆవిడకు తెలుసు. ఈ కోడళ్ళకేం తెలుసు! వాళ్ళు పల్లే, పట్నమూగాని పేటకొంపలనుంచీ చదువూ గిదువూ కొంత ఒంట బట్టించుకుని నరసయ్యకాపురానికి దిగుమతయ్యారు. వాళ్ల కెంతసేపూ కాఫీలు, పెసరట్లలాంటి పిట్టమేతల గొడవేగానీ మామగారి భోజనం సంగతి ఏంపట్టింది! వాళ్ళ ధోరణి గమనించి నరసయ్యమామ కూడా తన కదీ, యిదీ తినాలనుందని కోడళ్ళకు పురమాయించడం మానుకున్నాడు. లేదంటే ఆ వెర్రికాలంలో తనకు నాగమ్మ చేసిపెట్టిన వంటకాల్ని తలచుకుంటూ సంతృప్తి పడుతుంటాడు.

మొన్న నే గడచిపోయింది గదూ ధనుర్మాసం. ఆ ధనుర్మాసాన్నే నరసయ్యమామ పండుగ నెల అంటాడు. ఆ పండుగనెలలో ఒక తమాషా జరిగింది.

ధనుర్మాసం ప్రారంభం కాగానే నరసయ్యమామ కోడళ్ళిద్దరూ తెల్లవారు ఝామునే స్నానాలు చేసి



సర్పరాజు

—ఫొటో: ఎ. ఎల్. కాంతారావు

## ★ వనభోజనం ★

పూజా పురస్కారాలు చేయ సాగేరు. ఎక్కడాలేనంత భక్తి వాళ్ళకా నెలమొదలు కావడం తోటే కలిగింది!

ఎవరి భక్తి వాళ్ళది. వాళ్ళ భక్తితో నరసయ్యమామకు ప్రసక్తిలేదు. కానీ ఆనెల పొడుగునా యింట్లో శాకాహార నియమం పాటించబడాలంటే ఎలాగ? చిక్కంతా అక్కడే వచ్చింది మా నరసయ్యమామకు!

పండుగ నెల రాబోతోందనగా నరసయ్యమామ కాయలా పడి లేచాడు. ఇక బ్రతకడనే అనుకున్నారు. బ్రతికాడు. కానీ మనిషి మాత్రం బాగా చిక్కిపోయాడు. ఐనా అతడు ఏగంట నడుస్తుంటే మాకందరికీ చచ్చినవాడొకడు మళ్లీ బ్రతికి వచ్చినంత సంబరం కలిగింది.

కాయలానుంచీ తేరుకోగానే నరసయ్యమామ పెద్దకొడుకును పిలిచి "ఒరే బాబూ! కోతకు పెట్ట కోడి ఏదైనా వుందేమో చూడు" అన్నాడు.

కొడుకు నేరుగా భార్య దగ్గరికి వెళ్ళి "చూడా! మా నాన్నగారికి నాలుక చవి చెడిపోయినట్టుంది. కోడిపెట్ట వుందేమో చూడమంటున్నాడు" అన్నాడు.

రత్నమ్మమండిపడింది. "పండుగ నెలలోకూడా ఆ పాపిష్టిపని చేయక పోతే ఏమండీ! ఈ నెల రోజులు కాస్త వూరుకోమనండీ! వనలపండుగ నాటికి ఎలాగ వుండనేవుందిగదా!"

ఆ మాటలు నరసయ్య మామ చెవులదాకా వచ్చాయి. అతడు

బాలగేయం:

# నారి చేసిన పని

పణతుల రామచంద్రయ్య

నాయుడుగారింటిలోన
నారిగాడు నౌకరు
అదోరకం మనిషివాడు
అమాయకుడు పాపము!

నాయుడుగారొకరోజున
నలుబది మామిడిపండ్లను
గంపలోనమర్చి నారి
గాడి నెత్తికెత్తెను.

"ఈ పండ్లను మాకుమార్తె
యింట నిచ్చి ర"మ్మంటూ
నాయుడుగారొక జాబును
నారిగాడి కిచ్చెను.

దారిలోన నారిగాడి
నోరు ఊరి పోవసాగె
కడకొక వృక్షము చాటున
గంప దించివేసినాడు.

కనిపెడుతుందనుకొని జా
బు నొక గోతిలోన పూడ్చి
పసందైన పండ్లు రెండు
భక్షించెను నారిగాడు.

తిరిగి జాబును బయటికి
తీసి—గంప నెత్తిన బె
ట్టుకొని వాడు నాయుడుగా
రి కుమార్తె గృహమ్ము చేరె.

పండ్లను లెక్కించి—జాబు
పఠించి నాయుడి కుమార్తె
'నలభైలో రెండు పండ్లు
వెలితియైన దే'మనియెను.

ఆ మాటకు నారిగాడు
ఆశ్చర్యం పడియిట్లనె—
"అమ్మగారు! రెండు పండ్లు
ఆరగించినాను—నిజము.

కానీ, ఈ జాబు గోతి
లోన పూడ్చినా, ఎట్లా
పసిగట్టినదమ్మా ఈ
వైనం? దీన్నిగదరగా!"

నారిగాడి ఈ మాటకు
నాయుడుగారి కుమార్తెకు
ఏడ్వాలో నవ్వాలో
ఏమీ తెలిసింది కాదు!

వేడిగా నిట్టూర్చి మెల్లగా బయటికి వెళ్లిపోయాడు.

ఊతకర్ర సాయంతో నెమ్మదిగా నడుస్తూ నరసయ్యమామ ఏరుదాటి మామిడితోపు వైపు దారి తీశాడు. నాగమ్మత్త పోయినతరువాత అతడు మామిడితోటలో స్వయంగా తను వేసుకున్న గుడిసెలోనే ఎక్కువకాలం గడిపివేస్తుంటాడు. తోటలో అక్కడక్కడా టెంకాయచెట్లుగూడా వున్నాయి. ఈమధ్య దొంగతనాలు ముదిరిపోయి, రేయింబవళ్లు కాపుండకపోతే టెంకాయలు వంబాలకు వంబాలే మాయమైపోతుండడంవల్ల నరసయ్యమామ పాలేరు రాముడితోపాటు రాత్రుల్లో గుడిసెలో పడుకుంటాడు. నిద్రవస్తే నిద్రపోతాడు. లేకుంటే పదాలు పాడుకుంటాడు.

మూతి ముడుచుకుని గుడిసె ముందరున్న మంచంపైన కూలబడిన నరసయ్యమామ ముఖం చూచి ప్రక్కన్నే వేరేడు చెట్టుకిందకి నీరు బావిలో కబిలె తోలుకుంటున్న రాముడు "ఏం బాబయ్యా! అలా వున్నావు" అని అడిగాడు.

"ఏం లేదురా! కాయలు పడి లేచానా! నాలుక కొయ్యలా గిడస బారిపోయింది. ఏది తినబోయినా సహించడంలేదు" అన్నాడు నరసయ్యమామ.

"కారం తగిలించరాదూ మరి!"

## ★ వనభోజనం ★

అన్నాడు రాముడు, చానను బావిలో మునక వేయిస్తూ,

"మన మాటేం సాగుతుంది రాముడూ! అదేదో పండుగ నెలట్నే, పండుగ నెల! ఈ నెలరోజులూ ఒక పొద్దుండాలట! ఇంట్లో ఆవాసనే తగలగూడదంటోంది కోడలు."

రాముడు ఎద్దుల్ని బారిలో నిలబెట్టి గుడిసెదగ్గరికి వచ్చి "చూడు బాబయ్యా! నేనోకటంటాను. నువ్వు మారు చెప్పగూడదు" అన్నాడు.

"ఏమిట్రా అది" అన్నాడు నరసయ్యమామ.

రాముడు కొంతసేపు ఆలోచించి "ఊఁహు. నేను చెప్పను. చెబితే నువ్వు ససేమిరా ఒప్పుకోవు. రాత్రికి నీకే తెలుస్తుందిగా" అంటూ మళ్లీ బావిదగ్గరికి వెళ్లిపోయాడు.

ఆరోజు రాత్రి.

తొలిఝాము గడచిపోయి మలిఝాము ప్రారంభమౌతుండగా రాముడు గుడిసెలోపలికి వచ్చాడు. పొగాకు నములుతూ ఏదో కీర్తన పాడుకుంటున్న నరసయ్యమామ "ఏంరా రాముడూ! ఇప్పుడొస్తున్నావు?" అన్నాడు.

"ఊరికే వస్తున్నానా, ఎంతపని చేశానని! చూడు" అంటూ రాముడు కప్పుకున్న దుప్పటిలోనుంచి నల్లటి కోడిపెట్టను పైకి తీశాడు.

"అదేంపనిరా బాబూ! ఎక్కడినుంచీ తెచ్చావు? ఎవరికైనా తెలిస్తే? ఛా. దొంగతనంచేసి ఎవడు తినమన్నాడురా మనల్ని? అంతకన్నా చస్తే నయంకదూ!" అన్నాడు నరసయ్యమామ.

"దొంగతనం చేసిందెవరు బాబయ్యా! నేను! వస్తే ఆ పాపం నాకొస్తుంది. నీకేంభయం! నువ్వూరుకో. కట్టెలు సిద్ధంగా వున్నాయి. కావలిసిన వస్తువలన్నీ సాయంత్రమే యిక్కడికి తెచ్చి వుంచాను. రెండు గడియల్లో కూర్వొండేస్తాను" అన్నాడు రాముడు.

నరసయ్యమామ ఎంతో చెప్పిచూచాడు. కాని రాముడు తను పట్టిన కుందేటికి మూడే కాళ్ళన్నాడు.

*　　*　　*

మరునాటి వుదయం నరసయ్యమామ ముఖం కడుక్కుని యింటికి వచ్చేసరికి కోడళ్లిద్దరూ పెరట్లో నిలబడి యిరుగు పొరుగుల నాలుగైదిళ్ళకు వినబడేట్లు కేకలేస్తున్నారు.

"ఇంతపని చేసిన వాళ్ళు నిద్రపోతున్నప్పుడు గొంతుమీద రాయి వేయరూ! చిన్నదా చితకదా! గుడ్లుపెట్టే వక్కానికి వచ్చిన కోడిపెట్టే!" అంది పెద్దకోడలు రత్నమ్మ.

"ఏనా యింత అన్యాయమా! ఎంత పెట్ట! ఎంత పెట్ట! గంపక్రింద మూసిపెట్టాలని ఎత్తుకోబోతే కుడిచేయి క్రిందికి ఒరిగిపోయేదే!" అంది చిన్నకోడలు బంగారు.

"తినని, తిననీ! చేను తిడితే శాపం పెట్టినట్టే! పోతారు! నాశనమై..."

రత్నమ్మ మాట పూర్తిగాక ముందే నరసయ్యమామ చరచరా పెరట్లోకి వచ్చి "మహా చూచారులే బంగారుపెట్ట! నోరు మూసుకోండి చాలుగాని! వట్టి ఎముకలగూడు! నమిలి నమిలీ పండ్లే అరిగిపోయాయి" అన్నాడు.

రత్నమ్మ బంగారు ముఖం చూచింది. బంగారు రత్నమ్మ ముఖం చూచింది. ఇద్దరూ మునిపళ్ళతో నాలుకను కొరుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయారు. ★





చర్మపుబాధలకన్నిటికి

"సైబాల్"

చర్మవ్యాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విషక్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబి గ్రైప్"

తయారీదార్లు

దిసౌత్ ఇండియన్

మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు

సీతారామ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.

